క్లుప్తంగా

కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు



అలంకరణలో నేల బెలుం మల్లేశ్వరస్వామి

కొలిమిగుండ్ల: శివునికి ప్రీతికరమైన కార్తీక మాసం నవంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానుండడంతో మండలంలోని పలు శైవ క్షేత్రాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా కార్తీక మాసంలో బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న బిలంలో మహిళలు కార్తీక స్నానాలు ఆచరించి దీపాలు వెలిగిస్తారు. అలాగే పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయం, కాచూటి విశ్వేశ్వరస్వామి ఆలయాలతో పాటు పలు శివాలయాల్లో విశేష పూజలు జరగనున్నాయి. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణం వెలిగించనున్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ ఉంటుందని వెల్లడించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ప్యాపిలి: మండల పరిధిలోని 18 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి, నీటి సౌకర్యం కల్పించడానికి నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్ ఆదివారం తెలిపారు. ఒక్కో కేంద్రంలో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, మోటార్, సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటుకు రూ. 17 వేలు చొప్పున మంజూరైనట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలోని పైప్‌లైన్ ద్వారా కొళాయి కనెక్షన్ తీసుకుని మోటార్ ఏర్పాటు చేసి సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. పలు కేంద్రాల్లో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. మిగిలిన కేంద్రాల్లో కూడా త్వరలోనే పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తామన్నారు.

రేపు జంబులద్దిన్నెలో గ్రామ సభ

బనగానపల్లె రూరల్: మండలంలోని జంబులద్దిన్నె గ్రామంలో ఈ నెల 29న గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. భూ సర్వేలో వచ్చిన సమస్యలు, అభ్యంతరాలపై గ్రామస్తులు వినతిపత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు. వాటిని విచారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

కోవెలకుంట్ల: రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని కోవెలకుంట్ల, రేవనూరు ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కుటుంబంతో ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. రౌడీషీటర్లు వారి ప్రవర్తనలో మార్పు తెచ్చుకున్నట్లు పోలీసులు భావిస్తే వారిపై షీట్లు ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

మహానందిలో సండే సందడి

మహానంది: ఆదివారం సెలవు రోజు కావడంతో మహానంది ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. సెలవు రోజుతో పాటు పెళ్లిళ్లు అధిక సంఖ్యలో జరగడంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కనిపించింది. నూతన వధూవరులు కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేకువజామున స్వామి, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతులు ఇచ్చారు.

సమస్యల నిలయం

డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో సమస్యలు తిష్టవేశాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోతున్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చేరిన మురుగు

వర్షమొస్తే నరకమే

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్.బుక్కాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వే అండర్ వేర్ బ్రిడ్జి ఉంది. వర్షం వస్తే చాలు ఇక్కడ నీరు చేరి వెళ్లలేని పరిస్థితి. వర్షపు నీరు తగ్గినా బురద, మురుగు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదుపు తప్పి కింద పడిన సంఘటనలు ఉన్నాయి. నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రద్దీ ప్రాంతంలో ప్రహరీ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

డోన్: పట్టణంలో జనసంచారం అధికంగా ఉన్న ఆంధ్రాబ్యాంక్ ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి పశువులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని చెబుతున్నారు. రెండు ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు, ప్రైవేటు, ప్రభుత్వ బ్యాంకులు ఉన్న చోట రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారని విద్యుత్ అధికారులపై స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ గోడ లేదా కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



సీతారామాపురం రహదారిలో ఇరు వైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

రోడ్డుపైకి పిచ్చిమొక్కలు

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్ నగర్, సీతారామాపురం, కర్నూలు, నంద్యాల, బనగానపల్లె వైపు వెళ్లే రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు రహదారుల పక్కన గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిరుపయోగంగా బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్



డోన్: పట్టణ నడిబొడ్డున 30 ఏళ్ల క్రితం బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల కోసం నిర్మించిన క్వార్టర్స్ నిరుపయోగంగా మారాయి. 20 ఏళ్లుగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఎవరూ ఈ క్వార్టర్స్‌లో నివాసం ఉండేందుకు ఇష్టపడడం లేదు. దీంతో భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షలు వెచ్చించి 20 మంది ప్రభుత్వ ఉద్యోగులకు నిర్మించిన ఈ భవనాలు ప్రస్తుతం అసాంఘిక శక్తులకు నిలయాలుగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేసి నివాస యోగ్యంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి దుస్థితి



ఎస్సార్‌బీసీ 9వ బ్లాక్‌లో పొలాలకు వెళ్లే రహదారి దుస్థితి

బనగానపల్లె: ఎస్సార్‌బీసీ ఆయకట్టు పరిధిలోని 9వ బ్లాక్‌లో పంట పొలాలకు వెళ్లే రహదారి ఇరువైపులా ముళ్లపొదలతో నిండిపోయింది. పొలాలకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని పరిధిలో సుమారు 3వేల ఎకరాల్లో రైతులు వరి, మొక్కజొన్న, మిరపజొన్న తదితర పంటలను సాగు చేశారు. ఎరువులు, పంట దిగుబడిని ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన దారి లేకపోవడంతో పంట కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. రోడ్డుపై పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలని తొలగించి దారిని అభివృద్ధి చేస్తే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు.

మంగపల్లెలో వైద్య శిబిరం



వైద్య శిబిరానికి తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన 1400 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: ప్యాపిలి మండలం బావిపల్లె గ్రామానికి చెందిన మల్‌రెడ్డి జనార్దన్ సహకారంతో జోస్ వందపడకల ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, గర్భిణులు, వారి సహాయకులకు రొట్టెలు, గుడ్లు, పప్పు, అరటి పండ్లను పంపిణీ చేశారు. ఆదివారం ప్రార్థన సమయం సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ చేతుల మీదుగా వీటిని అందజేశారు.

తుపాన్ మిగిల్చిన నష్టం



సొదరదిన్నెలో దెబ్బతిన్న జొన్న పంటను దున్నివేసిన దృశ్యం

- అధిక వర్షాలతో దెబ్బతిన్న పైర్లు దున్నివేత
- శనగ, జొన్న పంటలకు తీవ్రనష్టం

కోవెలకుంట్ల: ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు కోటి ఆశలతో వివిధ పంటలు సాగు చేశారు. సాగు ఆరంభంలోనే అన్నదాతపై వరుణుడు పగబట్టాడు. అధిక వర్షాలతో పైర్లు దెబ్బతినడంతో రైతులు పైర్లను దున్నివేసే పనుల్లో నిమగ్నమయ్యారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రైతులు విస్తారంగా పప్పుశనగ, జొన్న పంటలు సాగు చేశారు. రసాయన ఎరువులు, విత్తనాలు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 6 వేల నుంచి రూ. 8 వేలు వెచ్చించారు. పైర్లు మొలకెత్తే సమయంలో తుపాన్ ప్రభావంతో వారం రోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. అధిక వర్షాలతో మొలకలు కొట్టుకుపోయి పైర్లు అరకొరగా మొలకెత్తాయి. పైర్లు ఆశాజనకంగా లేకపోవడంతో దున్నివేసి తిరిగి విత్తనం వేసే పనులపై దృష్టిసారించారు. గత ఏడాది తీవ్ర వర్షాభావంతో రబీ పంటలు దెబ్బతినగా ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే అధిక వర్షాలతో పైర్లకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పంటనష్టం అంచనా వేసి తిరిగి విత్తనం వేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న రామాంజినేయులు

డోన్ రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నిక ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని నక్కి రామన్న భవన్‌లో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కె.రామాంజినేయులు, ఎస్.రంగనాయుడు మాట్లాడుతూ.. ఒక వైపు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజలను ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. నిత్యావసర ధరలు నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఇంత వరకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి మోటారాముడు, మండల కార్యదర్శి నారాయణ, వరదరాజులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు టీడీపీకే చెల్లు

- దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా టీడీపీ నేతల తీరు
- బుగ్గనను అడ్డుకోవడం హేయమైన చర్య
- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు



మాజీ మంత్రి బుగ్గన స్వగృహంలో మాట్లాడుతున్న శ్రీరాములు

డోన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రోటోకాల్ వర్తించనందు వల్లే మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటుకు తాళం వేసి వాకింగ్‌కు రాకుండా అడ్డుకోవడం జరిగిందని టీడీపీ నాయకులు ప్రకటనలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. ఆదివారం మాజీ మంత్రి బుగ్గన స్వగృహంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకుంటే మంచిదని హితవుపలికారు.

ప్రోటోకాల్ గుర్తుందా?

వైఎస్సార్‌సీపీ టికెట్‌పై కౌన్సిలర్‌గా గెలిచి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా మంత్రి బుగ్గన దయ వల్లే కోట్రికె హరికిషన్ ఎన్నికయ్యాడనే విషయాన్ని మరిచిపోయి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ ప్రోటోకాల్ వర్తిస్తుందని టీడీపీలో కనీస ప్రాథమిక సభ్యత్వం లేని మర్రి రమణ లాంటి వ్యక్తులు జగనన్న కాలనీలో హౌసింగ్‌పై రివ్యూను నిర్వహించారని ప్రశ్నించారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రజాప్రతినిధులెవరినీ ఆహ్వానించకుండా అధికార పార్టీ నాయకులను ఏ ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

బుగ్గనను విమర్శించే స్థాయి మీకెక్కడిది

మాజీ మంత్రి బుగ్గనను విమర్శించే ముందు టీడీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. డోన్ పట్టణంలో ప్రధాన రహదారులను ఆక్రమించిన టీడీపీ నాయకులకు హుందా తనంపై మాట్లాడే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలంటూ చిల్లర మాటలు మాట్లాడే వ్యక్తులకు బుగ్గనను విమర్శించే స్థాయి లేదన్నారు. హుందా రాజకీయాలు నడిపారు కాబట్టే ప్రభుత్వాస్పత్రి శంకుస్థాపన సమయంలో టీడీపీకి చెందిన పెద్దకేశవయ్యగౌడ్, శేషఫణిగౌడ్‌లతో టెంకాయలు కొట్టించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి రోజు ప్రెస్‌మీట్లు పెట్టి ఎమ్మెల్యే కోట్ల మెప్పు పొందాలని చేసే నాయకుల జాతం ప్రజలకు తెలుసన్నారు. బేతంచెర్ల జెడ్పీటీసీ సభ్యురాలిగా వలసల రామక్రిష్ణ భార్యను గెలిపించిన మాజీ మంత్రికే వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఎవరిదని ప్రశ్నించారు. నాలుగు నెలల కాలంలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, వంశీ, అశోక్, వెంకట్రాముడు, కోఆప్షన్ సభ్యుడు పాతపేట రఫీ, పార్టీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, చంద్ర, రఫీ, నాగిరెడ్డి, వెంకటేష్, టమటం రఘువీర్‌గౌడ్, సతీష్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు





గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, అనుమానితుని ఇంటిలో పోలీసుల సోదాలు

డోన్ రూరల్: గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానితులు, రౌడీషీటర్లు, నేర చరిత్రగల వారి ఇళ్లలో సోదాలు చేశారు. గ్రామంలో త్వరలో జరగనున్న దేవరకు గ్రామస్తుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పోలీసులు అవగాహన కార్యక్రమాలతో పాటు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. అందరూ కలసికట్టుగా దేవరను జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు. అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సీఐలు రాకేష్, ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐ మమత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక ఉత్సవాలకు ముస్తాబు

- ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో ఏర్పాట్లు



మల్లికార్జునస్వామి , భ్రమరాంబ అమ్మవారు



ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం

బేతంచెర్ల: దేవతలే ముచ్చటపడి భూలోకంలో శైవ క్షేత్రాన్ని నెలకొల్పి పవిత్ర స్థలంగా ప్రసిద్ధికెక్కిన ఆలయం ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి దేవాలయం. నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీక మాస ఉత్సవాలకు ముస్తాబవుతోంది. బేతంచెర్ల మండలానికి 5 కిలోమీటర్ల దూరంలో హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో ఈ ఆలయం ఉంది. ఏటా కార్తీక మాసంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఆలయ చరిత్ర

భోళా శంకరుడిగా శివుడు రాక్షసులకు అడిగిందే తడువుగా వరాలు ఇస్తుండగా, శివున్ని ప్రసన్నం చేసుకోవాలని దేవతలు భావించారు. ఫలితంగా ఈ స్థలంలో ముక్కోటి దేవతల సమక్షంలో శివలింగ ప్రతిష్టాపన జరిగింది. ఆ తరువాత రాక్షసులకు, దేవతలకు మధ్య జరిగిన యుద్ధంలో దేవతలు విజయం పొందారని ప్రజల విశ్వాసం. ముక్కోటి దేవతలు ముచ్చటపడి శివలింగం ప్రతిష్ఠించడంతో ఈ దేవాలయానికి ముచ్చట్ల మల్లికార్జునస్వామి అనే పేరు వచ్చినట్లు తెలుస్తోంది. శివలింగ స్థాపన గురించి మరో కథ కూడా ప్రచారంలో ఉంది. ఇక్కడ శివలింగాన్ని అగస్త్య మహాముని ప్రతిష్ఠించగా, జనమేజయుడు ఈ దేవాలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు కథనం. శ్రీశైల మల్లికార్జునస్వామి అంశే ఈ క్షేత్రంలో స్వయంభు లింగంగా వెలిసిందని మరో కథనం. ఇక్కడ ప్రతి సోమవారం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడి ప్రకృతి రమణీయత ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఎత్తయిన గాలిగోపురం శిల్పకళా నైపుణ్యానికి, ఆనాటి కట్టడాలకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ గాలిగోపురం శ్రీకృష్ణ దేవరాయులు నిర్మించినట్లు రాతి శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం కురిసిన వర్షాలతో సెలయేరు గల గల సవ్వడులు ఆలయానికి కొత్త అందాన్ని తెస్తున్నాయి.

మంత్రి బుగ్గన చొరవతో ఆలయానికి మహర్దశ

2022లో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఆలయానికి రూ.3 కోట్లతో బీటీ రోడ్డు వేశారు. ఆయన చొరవతోనే 2024లో రూ.1.90 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గాలిగోపురం పునరుద్ధరణ పనులు, ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్, కోనేరు, రథశాల నిర్మాణంతో పాటు రథోత్సవానికి తేరును తయారు చేయడానికి ఏర్పాట్లు చేశారు. మార్చి 3వ తేదీ భూమి పూజ కూడా చేశారు. అయితే ఆ తర్వాత పరిణామాలతో ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.



బుగ్గానిపల్లెలో వృష భాలతో విత్తనాలు వేస్తున్న రైతన్నలు, బేతంచెర్లలో ట్రాక్టరు సాయంతో..

జోరుగా రబీ సాగు

బేతంచెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో రైతన్నలు రబీ సాగు పనులు ప్రారంభించారు. ఆర్ఎస్ రంగాపురం, బుగ్గానిపల్లె, బేతంచెర్ల, హెచ్.కొట్టాల, బలపాలపల్లె, యంబాయి గ్రామాల్లోని నల్ల రేగడి భూముల్లో శనగ, జొన్న, విత్తనాలు విత్తుతున్నారు. ఈనెల ప్రారంభం నుంచి సబ్సిడీపై శనగ విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నారు. ముద్దవరం, ముసలాయిచెర్వు, ఎం.పేండెకల్లు, గూటుపల్లె, తవిసికొండ, కొలుములపల్లె గ్రామాల్లోని ఎర్రనేలల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన కొర్ర, సజ్జ పంటలను తొలగించి పెసలు, జొన్న, మినుములు, ఉలవలు వేస్తున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు విత్తనాలు విత్తే పనిలో బీజీగా ఉన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా రాముడు



మోటా రాముడుని అభినందిస్తున్న నాయకులు

డోన్ రూరల్: సీపీఐ పట్టణ కార్యదర్శిగా మోటా రాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం డోన్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పట్టణ కార్యదర్శిగా మోటా రాముడు, సహాయ కార్యదర్శిగా ఎస్.కె.రామ్మోహన్‌తో పాటు 28 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. వారికి నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు పాల్గొన్నారు.